

బిఎల్ఓల బకాయి గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో బిఎల్ఓలకు గౌరవ వేతనం గత మూడు సంవత్సరాల నుండి ఇవ్వడం లేదని, వెంటనే బకాయి గౌరవ వేతనం ఒక్కొక్కరికి సుమారు రూ.18 వేలు వెంటనే అందజేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును కోరినట్లు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన అదనపు ఎన్నికల అధికారి బిఎల్ఓలకు సంబంధించిన గౌరవ వేతనం ఫైల్ ఫైనాన్స్‌లో ఉందని, త్వరలోనే నిధులు విడుదలవుతాయని తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, బాలాజీరెడ్డి, హనుమంతు పాల్గొన్నారని తెలిపారు.

ఇల్లు కట్టేదెలా..!

భారంగా నిర్మాణ సామగ్రి ధరలు
రెండు గదులు, హాలుతో ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షలుపైనే
హడలిపోతున్న సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజానీకానికి సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యులు ఇల్లు కట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రెండు పడక గదులు, హాలు, వంటగది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ.20 లక్షలుపైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి నిర్మాణంవైపు ఆలోచించాలంటేనే సామాన్య ప్రజానీకం వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపోవడంతో ఇంటి నిర్మాణంవైపు సామాన్యులు ఆలోచించడం వదులుకుంటున్నారు. అత్యధికం మంది సొంతిల్లు నిర్మాణాలను వేసవిలో ఎక్కువ చేపడతారు. వాతావరణం అనుకూలంగా ఉంటుందని ఆలోచన చేస్తారు. ప్రస్తుత వేసవిలో కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా సాగడం లేదని తాపీపనివారు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒక్కటే. సామాన్యులు భరించలేని స్థితికి నిర్మాణ వ్యయం పెరిగింది. ప్రభుత్వం జిల్లాలో లక్షకుపైగా ఇంటిస్థలాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసేందుకు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం నిర్మాణ వ్యయమే. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పడక గదులు, హాల్, వంటగది తరహా ఇంటి నిర్మాణం చేయాలని సామాన్య ప్రజానీకం ఆలోచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టన్ను ఐరన్ ధర రూ.66 వేలు పలుకుతోంది. ఇసుక ఐదు యూనిట్లు లారీ ధర రూ.17,500 ఉంది. వెయ్యి ఇటుక ధర రూ.30 వేలు,



సిమెంట్ బస్తా ధర రూ.325కు చేరింది. ఇల్లు నిర్మించడానికి తాపీపని వారి ఖర్చు రూ.ఆరు లక్షల వరకూ అవుతోంది. ఇవికాకుండా గుమ్మాలు, కిటికీలు, విద్యుత్ సామాన్లు, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో ఇల్లు కట్టాలంటే వెనుకాడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.రెండు లక్షలు మాత్రమే సాయం చేస్తోంది. ఈ సొమ్ము విడుదలకు కూడా సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఏమాత్రం పెంచడం లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో కష్టపడి కట్టిన ఇంటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్లు ఇస్తున్నాయి. అయితే ప్రొసెసింగ్ ఫీజుల రూపంలో రూ.25 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యవసాయ పనులు చేసుకునే సామాన్య ప్రజానీకం ప్రతినెలా బ్యాంకులకు ఇఎంఐలు కట్టడం కష్టతరమైన పని కావడంతో సామాన్యుల భయపడుతున్నారు. భూముల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు సెంటు భూమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సొంతిల్లు సైతం కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. సామాన్య ప్రజానీకం రూ.20 లక్షలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేయడం ఏమాత్రం సాధ్యంకాని పరిస్థితిగా మారిపోయింది. దీంతో చాలామంది ఇప్పటికే ఉన్న చిన్నపాటి ఇంటిలోనే కాలం గడుపుతుండగా, అద్దె ఇంట్లో ఉండేవాళ్లు అదేరీతిలో ఉండిపోతున్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సాయం పెంచాల్సి ఉంది. లేకపోతే సామాన్యుల బతుకులు 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉండిపోనున్నాయి.

ఐరన్ టన్ను రూ.66 వేలు
సిమెంట్ బస్తా రూ.325
ఇసుక ఐదు యూనిట్లు రూ.17,500
4 వేల ఇటుక ఖరీదు రూ.30 వేలు
ఇంటి నిర్మాణానికి తాపీవారి ఖర్చు రూ.ఆరు లక్షలుపైనే

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు
ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్
రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా, పటిష్టంగా ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఆ దిశగా అభ్యర్థులు, రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లుగా పంపే వారి పూర్తి వివరాలను ఫారం-18 లో ఈ నెలాఖరు నాటికి సమర్పించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ అనంతరం కూడా 15 రోజులపాటు శాంతిభద్రతల సమస్య రాకుండా ముందస్తు పూర్తి భద్రతా చర్యలు అమల్లో ఉంటాయన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థితోపాటు ఎవ్వరివీ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు అనుమతించబోమన్నారు. ప్రవేశ మార్గం వద్దే వాటిని ఉంచాల్సి ఉంటుందన్నారు. రౌండువారీ ఫలితాలను ప్రదర్శిస్తారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇవిఎంల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదేసి చొప్పున వివిప్యాట్లలో ఓట్లను లెక్కిస్తారన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి ఇద్దరు, ముగ్గురు చొప్పున కౌంటింగ్ ప్రక్రియను నిర్దేశిత ప్రాంతం నుంచి చిత్రీకరించాలే తప్ప ఇవిఎంలను జూమ్ చేసి తీసేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో మూడంచెల భద్రత కొనసాగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను వీడియోగ్రఫీ చేస్తామన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఆర్ఒలు, ఎఆర్ఒలు తదితరులకు రెండు విడతల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపునకు నియమితులైన సిబ్బందికి విధుల కేటాయింపునకు మూడు విడతల ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థి, ఏజెంటు ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కింపు కేంద్రాలను సందర్శించవచ్చని, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆయా అభ్యర్థులు, ఏజెంట్లు ఆ నియోజకవర్గానికే పరిమితమౌతారని తెలిపారు. ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను సంబంధిత అభ్యర్థులు, వారి ఏజెంట్లు ప్రతిరోజూ మూడుసార్లు నిర్దేశించిన సమయంలో సందర్శించి పరిశీలించుకోవచ్చన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాలకు సంబంధించి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా బాణాసంచా కాల్చడంపైనా నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాలుకు వచ్చేటప్పుడు డూప్లికేట్ ఫారం-17సి వైట్‌పేపర్, పెన్నులతో హాజరు కావాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చే వారు నిర్ధేశించిన గుర్తింపుకార్డులతో హాజరు కావాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిఆర్ఆర్.మోహన్‌రావు (వైసిపి), ఎంఎల్ఎస్ఎ.కుమార్ (కాంగ్రెస్), కె.బాలకృష్ణ (టిడిపి), బి.రాజు (నవరంగ కాంగ్రెస్ పార్టీ), డి.ఆదర్ష్ (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ డి.పుష్పమణితో కలిసి జిల్లాలో ఏడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లూ లేకుండా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందు నుంచే పరిశీలించుకోవాలన్నారు. ప్రతి లెక్కింపు కేంద్రంలో వెబ్ కాస్టింగ్, రౌండ్లవారీగా టేబుల్స్, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ ప్రక్రియకు ఉపయోగించే వస్తువులు, తదితర అంశాలను రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పర్యవేక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్‌కు అవసరమైన వస్తువుల చెక్‌లిస్టును తయారుచేసి రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని డిఆర్ఒను కలెక్టర్ ఆదేశించారు.

14 రౌండ్లలో ఉంగుటూరు ఫలితం

రిటర్నింగ్ అధికారి ఖాజావలీ



ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో జూన్ 4న ఉంగుటూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయని, 14 రౌండ్లలో ఈ నియోజకవర్గ ఫలితం వెల్లడి కానుందని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల్లో 2,06,437 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,81,152 మంది తమ ఓటు హక్కును ఇవిఎంల ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు. 1307 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 397 మంది వృద్ధులు, వికలాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా మొత్తం 1704 పోస్టల్ ఓటింగు నమోదైందన్నారు. వివిధ ఉద్యోగులు సర్వీస్ ఓటర్లుగా ఓటు వేసేందుకు 197 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వీరిలో 195 మంది సర్వీస్ ఓటు డౌన్‌లోడ్ చేసుకుని ఓటు వేసి వాటిని రిటర్నింగు అధికారికి పోస్టు చేశారని, ఈ నెల 23 నాటికి ఆలా సర్వీసు ఓటర్ల ఓట్లు 66 తమకు అందాయని తెలిపారు. జూన్ 4వ తేదీ ఉదయం 7.59 గంటల వరకూ అంటే లెక్కింపు రోజు చివరి నిమిషం వరకూ సర్వీస్ ఓటును స్వీకరించి వాటిని కూడా లెక్కింపులో పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఇవిఎంల్లో డేటాను



లెక్కించేందుకు 14 టేబుళ్లను సిద్ధం చేయనున్నామన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచే ఒకపక్క పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు, మరోపక్క ఇవిఎంల్లో ఓట్లనూ లెక్కిస్తామన్నారు. ముందుగా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు ఒకటో పిఎస్ నుంచి లెక్కింపు మొదలై ఆఖరు పిఎస్ అయిన గణపవరం మండలం ఎస్.కొండేపాడు పోలింగు బూత్ 214తో కౌంటింగ్ పూర్తి కావాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రౌండులో 14 ఇవిఎంల్లో ఓట్లు లెక్కించి రౌండ్లు వారీగా ఫలితాలను నమోదు చేస్తామన్నారు. గెలిచిన అభ్యర్థికి అదే రోజు ధ్రువీకరణపత్రం అందజేస్తామన్నారు. ఈ మేరకు పోటీ చేసిన అభ్యర్థులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహనా సమావేశం ఉంగుటూరులో నిర్వహించినట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన

నిందితుడిని, వీడియో చిత్రీకరించినవారిని శిక్షించాలి

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మండలంలోని పుల్లపర్రు గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని, వీడియో చిత్రీకరించిన నలుగురిని కఠినంగా శిక్షించాలని ఏలూరు జిల్లా మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకున్న పోలీసు అధికారులకు అభినందనలు తెలియజేస్తూ మహిళలపై ఏదో మూల ప్రతి రోజు అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ఇదే మండలంలో చింతపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ఆకతాయిల వేధింపులు భరించలేక ఉరివేసుకుని మృతి చెందిందన్నారు. ఈ ఘటనలో అత్యాచార వీడియోలను చిత్రీకరించి వైరల్ చేసిన నలుగురులో ఒక యువకుడు నిందితుడిగా ఉన్నట్లు తెలిసిందన్నారు. అశ్లీల చిత్రాలు, పోర్న్ వీడియోలు అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

బాలికపై అత్యాచార ఘటన దారుణం

కలిదిండి : మండవల్లి మండలంలోని పుల్లపర్రు గ్రామానికి చెందిన బాలికపై అత్యాచార ఘటన దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. ఈ ఘటనకు సంబంధించి అత్యాచార నిందితునితో పాటు వీడియో చిత్రీకరించిన నలుగురిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అత్యాచార వీడియోను చిత్రీకరించి, వైరల్ చేసిన నలుగురిలో ఒక యువకుడు మరో ఘటనలో నిందితుడిగా ఉన్నట్లు తెలిసిందన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం, వినోదం

ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్‌రాజా




వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదం పెంపొందించటమే హేలాపురి చిల్డ్రన్ క్లబ్ సమ్మర్ క్యాంపుల ఉద్దేశమని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్‌రాజా అన్నారు. ఏలూరులో గత వారం రోజుల నుంచి జరుగుతున్న హేలాపురి చిల్డ్రన్ క్లబ్ సమ్మర్ క్యాంపుల్లో భాగంగా గురువారం జిల్లా గ్రంథాలయం, బాలల గ్రంథాలయం, జింగిల్ బెల్ స్కూల్ వద్ద జరిగిన శిబిరాల్లో వారు మాట్లాడారు. ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. శిబిరాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, సంగీతం, డ్యాన్స్, ఆడ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రిక్స్ నేర్పుతున్నారన్నారు. స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల జీవిత విశేషాలు తెలియ జేస్తున్నామని చెప్పారు. చిల్డ్రన్ క్లబ్ సమ్మర్ క్యాంపుల కార్యదర్శి పి.దుర్గాప్రసాద్, క్యాంపు నిర్వాహకులు జి.శారద, రాజేశ్వరి, యు.దుర్గ, పవన్ రిసోర్స్ పర్సన్‌గా బోధిస్తున్నారు. జిల్లా గ్రంథాలయం నిర్వాహకులు సందీప్, ఇస్లామ్, బాలల గ్రంథాలయ నిర్వాహకులు కీర్తి, శోభా పాల్గొన్నారు.

కైకరంలో కానరాని స్వచ్ఛభారత్

డంపింగ్ యార్డులుగా ఏలూరు కాలువ రేవులు
నీరు కలుషితం అయ్యే ప్రమాదం



కైకరంవద్ద ఏలూరు కాలువ రేవు, గట్టు వెంబడి పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో చాలా గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గతంలో ఇచ్చిన చెత్త సేకరణ రిక్షాలు అధిక భాగం నిర్వహణ లోపం, నాణ్యతా లోపం, మరమ్మతులు కారణంగా మూలన పడ్డాయి. అవి సకాలంలో రాకపోవడంలో ఇళ్లల్లో చెత్తా చెదారం గ్రామాల్లో ఆరుబయటే వేసేస్తున్న పరిస్థితులు చాలా గ్రామాల్లో కనిపిస్తోంది. మండలంలో అతి పెద్ద గ్రామం కైకరం. దాదాపు 3500 నివాస గృహాలతో పది వేలకు పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో రెండు చెత్త రిక్షాలు మాత్రమే వినియోగంలో ఉన్నట్లు చెబుతున్నారు. నారాయణ పురంలో బజారులో హోటల్స్, ఇతర వ్యాపారస్తులు చెత్తను వంతెన పైనుంచి కాలువలో పడేస్తున్నారు. దీంతో ఏలూరు కాలువ వెంబడి రేవులు, వంతెన వద్ద చెత్త మురికి కూపంలా మారుతున్నాయి. కాలువలకు నీరు వదిలితే ఈ రేవుల్లో చెత్త కారణంగా పారిశుధ్య సమస్య ఉత్పన్నం కానుందని, ఇప్పటికైనా చెత్తను దూరంగా తరలించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఆసుపత్రి యాజమాన్యం

మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏలూరు రోడ్డులో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో ఇప్పటివరకు లేనివిధంగా సకల సౌకర్యాలతో అన్ని హంగులతో తమ మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినందుకు చాలా సంతోషిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రి నుంచి జంగారెడ్డిగూడెం చుట్టుపక్కల పరిసర ప్రాంత ప్రజలందరికీ సేవ చేసే భాగ్యం కలిగినందుకు గర్వపడుతున్నామన్నారు. తమ ఆసుపత్రిలో జంగారెడ్డిగూడెంలో ఇప్పటివరకు ఏ ఆసుపత్రిలో లేని అన్ని సేవలను వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. మమత హాస్పిటల్‌లో ప్రత్యేక విభాగాలైన గైనకాలజీ, ఆప్తమాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్, ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జంగారెడ్డిగూడెంలో ఎక్కడాలేని డయాలసిస్ సేవలను తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

25న డివైఇఒ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

డిఆర్ఒ డి.పుష్పమణి




ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలు ఈ నెల 25న ఏలూరు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ, జిల్లా సమన్వయ అధికారి డి.పుష్పమణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఈ నెల 25న నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలకు 320 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకుగాను ఏలూరులో సిద్దార్ధ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూల్‌ను, ఏలూరు ఇంజినీరింగ్ టెక్నాలజీ కాలేజీలోనూ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 7.30 గంటల నుండి 8.15 వరకు, గ్రేస్ పీరియడ్ కలుపుకుని 8.30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఎలాంటి పేపర్లు, మొబైల్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, ట్యాబ్‌లు, ఐపాడ్, బ్లూటూత్, పేజర్‌లు లేదా ఇంటరాక్ట్ చేయగలిగిన ఇతర పరికరాలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు మొదలైనవి అనుమతించబడవని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు, హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

70 రోజుల వేతనం వితరణ

చలివేంద్రంలో సహాయకురాలిగా పని చేస్తున్న మహిళకు అందించిన సురేష్‌బాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



నగదును వితరణగా అందిస్తున్న పంచాయితీ కార్యదర్శులు

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని హైస్కూల్ కూడలి వద్ద మనహక్కులకై పోరాడు-సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సహాయకురాలుగా పని చేస్తున్న మహిళకు ఆగిరిపల్లి మండల గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో 70 రోజుల వేతనం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.సంగమయ్య, సిహెచ్.పుల్లారావు, అయ్యంకి సురేష్‌బాబు, దొండపాటి దినేష్, పల్లగాని రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

అన్ని ఏర్పాట్లు పూర్తి : ఇంటర్మీడియట్ జిల్లా పరీక్షల కన్వీనర్ ప్రభాకరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


నేటి నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ మే-2024 థియరీ పరీక్షల నిమిత్తం ఏలూరు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు ఏలూరు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 8,664 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,133 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను 30 నిమిషాల ముందు నుంచి అనుమతించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 30 నిమిషాల ముందే చేరుకోవాలని సూచించారు. ఈ 27 పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాన్ని సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించామని చెప్పారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ సభ్యులు పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్ ఉపయోగించరాదని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08812-230197కు ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 4 పరీక్షా కేంద్రాలు

ఎంఇఒ రాముడు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

24 నుంచి నిర్వహించే పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ రాముడు తెలిపారు. ఈ పరీక్షలకు మండలవ్యాప్తంగా 1200 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్ష సమయమని, విద్యార్థులంతా పరీక్షా సమయానికి అరగంట ముందే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేశామని జంగారెడ్డిగూడెం ఎంఇఒ రాముడు తెలిపారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపిఎం

వంద రోజులు పని కల్పించుకోవాలి

ఉపాధి హామీ ఏపిఎం లీలా

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి ఉపాధి కూలీ తమ వంద రోజుల పని దినాలు కల్పించుకోవాలని మండల ఏపిఎం లీలా పేర్కొన్నారు. మండలంలోని సూరేపల్లి, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పని జరుగుతున్న ప్రదేశాలకు గురువారం ఆమె వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు పనిచేసే విధానం గురించి, తమ వంద రోజుల పని విధానం గురించి ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు.

మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలి

కలెక్టర్‌కు ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పని చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన పిహెచ్, నాన్ పిహెచ్ వర్కర్స్‌కు సంబంధించి తొమ్మిది మందికి 2022 ఏప్రిల్ నెలకు ముందే పిహెచ్ ట్రాక్టర్ డ్రైవర్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించారన్నారు. ఉద్యోగోన్నతి కల్పించి రెండేళ్లు పూర్తవుతున్నా డ్రైవర్‌కు మూల వేతనం ప్రకారం జీతం ఇవ్వకుండా వర్కర్ జీతం ఇస్తున్నారన్నారు. వీరికి వార్షిక ఇంక్రిమెంట్లు, అడాక్ ఇంక్రిమెట్లు గత రెండేళ్లగా ఇవ్వడంలేదన్నారు. నెలకు ఒక్కింటికి రూ.5 వేలు చొప్పున గత రెండేళ్లగా ఒక్కొక్కరు రూ.1.20 లక్షల జీతం నష్టపోయారన్నారు. ఈ డ్రైవర్స్ ఉద్యోగోన్నతి విషయమై నగరపాలక అధికారులు, కమిషనర్, అదనపు కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సంబంధిత డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజినీర్, తదితర అధికారులు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు తక్షణం జోకింగ్ చేసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని అప్పలరాజు కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి.అప్పారావు, ట్రాక్టర్ డ్రైవర్స్ ఉన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి చెన్నారావు

50 శాతం రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు తెలిపారు. ఆగిరిపల్లి ఆర్‌బికె వద్ద రాయితీపై గురువరాం పచ్చిరొట్ట విత్తనాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలని తెలిపారు. ఒక్క రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రాయితీ అందించనున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట పైరు సాగు వల్ల భూసారం పెరగటంతో పాటు, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందని, తద్వారా రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ బ్యూల

మహిళలకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట గ్రామ పంచాయతీలోని వీరభద్ర కాలనీలో మాసిక మహోత్సవం - 2024 కార్యక్రమం జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూల అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు, యుక్త వయస్సు బాలికలకు, తల్లితండ్రులకు, యువజనులకు ఋతుక్రమం సమయంలో ఉండే అపోహలు, ఆరోగ్యం, పరిశుభ్రత, ఋతు క్రమం సమయంలో వాడే ఉత్పత్తులు, వాటిని పారవేసే పద్ధతి గురించి, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల జరిగే అనర్థాలు, బాల్య వివాహ చట్టం గురించి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సుపర్‌వైజర్లు బివిఎల్.మంగాదేవి, ఎన్.వీరకుమారి, ఎఎన్ఎం ప్రియదర్శిని, మహిళా కానిస్టేబుళ్లు రాధ, ఎం.భారతి, షేక్ ఫర్వీన్, పలువురు అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, బాలికలు, గర్భిణులు, బాలింతలు, బాలుర తల్లితండ్రులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎస్పి మేరీప్రశాంతి ఆదేశాల మేరకు, ఏలూరు డిఎస్పి శ్రీనివాసులు పర్యవేక్షణలో, కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ సమక్షంలో ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకటకుమార్, కలిదిండి ఎస్ఐ వారి సిబ్బందితో మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని బొమ్మినంపాడు గ్రామ శివారు జానకిగూడెం గ్రామంలో జరిగిన జనరల్ ఎలక్షన్, జరగబోవు కౌంటింగ్ ప్రక్రియను పురస్కరించుకుని సదరు గ్రామంలో కార్డన్ చెర్చ్ జరిపారు. ఇందులో భాగంగా కొన్ని అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను గుర్తించి వాటికి సంబంధిత కాగితాలను క్షుణ్ణంగా పరిశీలించి వాహనాలను సంబంధిత వాహనదారులకు అప్పగించినట్లు ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు.

తాగునీరు, మజ్జిగ వితరణ అభినందనీయం

తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ సాల్మన్ రాజు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవిలో తాగునీరు, మజ్జిగ అందించడం పుణ్యకార్యమని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండెండింగ్ ఇంజినీర్ సాల్మన్ రాజు చెప్పారు. స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులచే ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రంలో గురువారం ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులు సామజిక బాధ్యతగా ప్రతి ఏడాది ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ప్రజలకు సేవలందిస్తున్నారని అభినందించారు. ఏలూరు పరిసర గ్రామాల ప్రజలు ఏలూరు పట్టణానికి ఎంతో మంది ప్రజలు వివిధ పనులపై వస్తుంటారని, ప్రస్తుత వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, వేడి గాలులు ఎక్కువగా వీయడంతో సామాన్య ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఏప్రిల్ 14 నుంచి రోజుకు 150 లీటర్ల పైగా విజయ డెయిరీ ద్వారా మజ్జిగ కొనుగోలు చేసి, రోజుకు వెయ్యి మందికి పైగా ప్రజలకు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రాల వద్ద ఉండడంతో వివిధ కారణాలతో పట్టణానికి వచ్చే ప్రజలకు ఉచిత మజ్జిగ ద్వారా దాహార్తిని తీర్చడం ఎంతో మంచి పుణ్యకార్యమని సాల్మన్ రాజు చెప్పారు. జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ జెపి బి.నటరాజన్, అదనపు ఇఇ డి.ప్రసన్నవల్లి, ఎజి.సత్యనారాయణ, ఎస్.బలుసుబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


కామవరపుకోట సర్వసభ్య సమావేశంలో ఎంపిపి విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపిపి మేడవరపు విజయలక్ష్మి చెప్పారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీరు సరఫరా చేసే ట్యాంకులను శుభ్రపరచాలని, అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కామవరపుకోటలోని కొన్ని ప్రాంతాల్లో రహదారులకు అంతరాయంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వాటి వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, వాటిని పక్కకు మార్చాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆమె కోరారు. జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్ మాట్లాడుతూ మండలంలోని తడికలపూడి దగ్గర మెయిన్ రోడ్డు బాగా గోతులు పడటం వల్ల ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను కోరారు. త్వరలో రహదారుల మరమ్మతులు చేపట్టడంతో పాటు మండలంలోని కళ్లచెరువు, ఆసన్నగూడెం మధ్య ఉన్న గుండేరు వాగుపై వంతెన పాడైపోయినందున కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.5.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రభుత్వ అనుమతుల రాగానే నిర్మాణం చేపడతామన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ఈ వంతెనపై రాకపోకలకు అంతరాయం కలగకుండా సుమారు రూ.20 లక్షలతో డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్అండ్‌బి అధికారులు సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తమ్మిశెట్టి గిరిజ, ఎంపిడిఒ జె.స్వర్ణభారతి, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

యువత శాంతి, సహనం, అహింస మార్గాల్లో నడుచుకోవాలి



మండవల్లి : బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాస్కరరావు, సూర్యారావు

ప్రజాశక్తి - మండవల్లి

గౌతమ బుద్ధుడు నేర్పించిన శాంతి, సహనం, అహింస మార్గాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, కె.సూర్యారావు అన్నారు. బౌద్ధ మత స్థాపకుడు బుద్ధుడు జయంతి కార్యక్రమాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడు చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తులను వెలిగించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎల్ ఎస్.భాస్కరరావు, కె. సూర్యారావు మాట్లాడుతూ బుద్ధుడు నేర్పిన శాంతి, సహనం, అహింస మార్గాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. మానవాళి ప్రగతి కోసం బౌద్ధమతం చూపిన మార్గం నేటికీ ఆచరణీయమన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 14 సంవత్సరంలోనే బుద్ధుని పట్ల ఆకర్షితులై అనుసరిస్తూ 50 ఏళ్ల పాటు బౌద్ధ ధర్మ గురించి స్పష్టంగా రాశారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కొరపాటి శాంతరాజు, కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్, గౌరవ అధ్యక్షులు చాబెత్తిన విజయ్, జి.రమేష్, గాజులపల్లి వెంకటేశ్వరరావు, ముక్కు చక్రధర్ పాల్గొన్నారు.

ఏలూరు : ఏలూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో అధ్యక్షులు మేతర అజయ్‌బాబు అధ్యక్షతన గౌతమ బుద్ధుని జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతిని కోరేలా మనుషులందరూ సమానమని, అజ్ఞానాన్ని వీడి జ్ఞానాన్ని పొందాలని ప్రబోధించారన్నారు. మాతృదేవోభవ సంస్థ కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి ప్రేమ తత్వాన్ని అహింస బోధనలను అందించి శాంతి స్థాపనకు కృషి చేశారని, ప్రతి మనిషి బుద్ధుని బోధనలు ఆచరించి నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పులుకులూరి చిన్నబాబు, కాశీ గౌతమ్, రాచేటి ఎఫ్రెయిన్‌కుమార్, వినుకొండ సంజన, అరవిన్, టైటాన్ రవి, ఆనంద్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు, గ్రంథాలయాలను వారికి మరింత చేరువ చేసేందుకు ఏలూరులోని స్థానిక బాలల గ్రంథాలయంలో వచ్చే నెల ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెలకువలు, కథలు చదవడం, కథలు చెప్పడం, పాటలు పాడడం, డ్యాన్స్‌లో శిక్షణ, క్యారమ్స్, స్పెల్లింగ్-బి ఇంకా మరిన్ని సరదా ఆటల పోటీలు ఎం.కీర్తి, హేలాపురి చిల్డ్రన్ క్లబ్ రిసోర్స్ పర్సన్స్‌చే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో చిన్నారులు

పేదల ప్రాణాలకు హాని జరిగితే తీవ్ర పరిణామాలు

ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలి

కాపు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎపి స్పెషాలిటీ ఆసుపత్రుల్లో గత రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత వల్ల ఏ ఒక్కరికైనా ప్రాణహాని జరిగితే తీవ్రపరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని కాపు సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. పేద రోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ప్రాణహాని జరిగితే ఎపి స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం లేదా ఆరోగ్యశ్రీ ట్రస్టు లేదా ఆపద్ధర్మ ప్రభుత్వం ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. అత్యవసర సేవలకు సంబంధించిన ఆరోగ్యశ్రీని ఎపి స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్సలు కొనసాగే విధంగా ముఖ్య ఎన్నికల కమిషన్, రాష్ట్ర గవర్నర్ తక్షణం జోక్యం చేసుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

ఘనంగా సహాయ మాత మహోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


ముదినేపల్లి ఆర్‌సిఎం చర్చి ప్రాంగణంలో సహాయమాత మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజైన గురువారం కూడా ఘనంగా ఉత్సవాలు కొనసాగాయి. ముదినేపల్లిలో ఆర్‌సిఎం సంఘం స్థాపించి 55 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ మమోత్సవ కార్యక్రమాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురుశ్రీ మాతంగి మరియా కుమార్, గురుశ్రీ రెంటాల విజయ్ ఆధ్వర్యంలో డివైన్ మెర్సీ ధ్యానాశ్రమం నుంచి వచ్చిన రెవరెండ్ ఫాదర్ తోమస్ (విసి) గురు శ్రీ అమల్ (విసి), మిస్టర్ ఫోర్ జిన్, బ్రదర్ చందు, బ్రదర్ బాలు దివ్య సత్ర్పసాధ ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఈ మహోత్సవాలకు ముదినేపల్లి విచారణ పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శుక్రవారం జరిగే ముగింపు వేడుకల్లో వేలాదిగా భక్తులు పాల్గొని సహాయమాత ఆశీస్సులు పొందాలని ఫాదర్ మరియా కుమార్ తెలిపారు.

సిహెచ్‌సి సిబ్బంది పని తీరు మార్చుకోవాలి

విధుల్లో అలసత్వం వహిస్తే సహించం

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

బుట్టాయగూడెం సిహెచ్‌సిని సందర్శించిన ఐటిడిఎ పిఒ సూర్యతేజ


రోగులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, విధుల్లో అలసత్వం వహిస్తే సహించబోమని, రోగులతో దురుసుగా ప్రవర్తించకుండా మెరుగైన వైద్య సేవలందించాలని ఐటిడిఎ పిఒ సూర్యతేజ అన్నారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం అర్ధరాత్రి సమయంలో సందర్శించారు. వైద్యం పొందుతున్న రోగులను భోజనాల గురించి అడిగారు. తమకు రాత్రి భోజనం అందించలేదని రోగులు తెలిపారు. భోజనాల వివరాలు నమోదు చేసే రిజిస్టర్‌ను పరిశీలించగా భోజనాలు పెట్టకుండానే పెట్టినట్లుగా వివరాలు నమోదు చేయడం, భోజనాల వివరాల నమోదు సక్రమంగా లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు భోజనం ఏర్పాటు చేయలేకపోవడం ఏంటని ప్రశ్నించారు. భోజనాల బిల్లుల విషయం తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని, అంతేకాని రోగులను, అటెండర్స్‌ని పస్తులు ఉంచుతారా అన్నారు.

ఇన్ పేషెంట్స్‌కి భోజనాలు అందుతున్నాయో లేదో తెలుసుకోకపోవడం, అవసరమైన రక్త పరీక్షలు రాయకపోవడం, రిజిస్టర్ గదిలో పెట్టి తాళం వేసుకుపోవడం, విధులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి అంతస్తులో నీటి శుద్ధికరణ, శీతలీకరణ యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా ఎందుకు నిర్వహించడంలేదన్నారు. అత్యవసరంలో రక్తం కొనుగోలు కోసం కొంత నిధులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడంలేదన్నారు. బుధవారం ఉదయం మోతుగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఆసుపత్రిలో ప్రసవించగా రక్తం తెచ్చుకోవాలని ఆమె భర్తకు చెప్పగా అమాయకత్వంతో ఎక్కడ తెచ్చుకోవాలో తెలియక రక్తం ఏర్పాటు చేసుకోలేకపోయిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. వైద్య సిబ్బందే రక్తం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని నిలదీశారు. రోగుల పట్ల సిబ్బంది తీరు మార్చుకోవాలని, వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే క్షమించేది లేదన్నారు. వైద్యులు పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న వైద్యులకు ప్రత్యేక అలవెన్సులు కల్పిస్తున్నామని, సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులు దగ్గరలో ఉండకపోతే వారు పొందే ప్రత్యేక అలవెన్సులు ఆపివేసి, ఇప్పటివరకు పొందిన వాటిని కూడా రికవరీ చేస్తామని తెలిపారు.

పెన్నా అనంతరామశర్మ మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజు

ప్రజాశక్తి - ముసునూరు

సిపిఎం ఉమ్మడి రాష్ట్ర మాజీ కమిటీ సభ్యులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు పెన్నా అనంత రామశర్మ సిపిఎంకు ఎనలేని సేవలందించారని ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. నూజివీడులోని సిపిఎం కార్యాలయంలో పెన్నా అనంతరామశర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ పెన్నా అనంతరామశర్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత బుధవారం రాత్రి తెలంగాణ రాష్ట్రం నలగొండలో మృతి చెందారని చెప్పారు. ఆయన మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నూజివీడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం గ్రామానికి చెందిన శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావుకు విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డు దక్కింది. బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి స్థాపించిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి, హైదరాబాదులో ఈ నెల 26న జరుగే అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా డాక్టర్ శ్రీనివాసరావు అవార్డు అందుకోనున్నారు. విశ్వబ్రాహ్మణ సామాజిక తరగతికి, సమాజానికి డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారని కొయ్యలగూడెం సంఘం అధ్యక్షులు దార్ల రాంబాబు అన్నారు. సంఘం కార్యదర్శి జవాబు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం నుంచి శ్రీనివాసరావు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మోడేపల్లి నాగు, సంఘ ఉపాధ్యక్షులు, పెద్దోజు శ్రీనివాసచార్యులు, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన గురువారం మాట్లాడారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. మండవల్లి మండలంలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ సెక్షన్లు జూన్ 19 వరకు అమలులో ఉంటాయని చెప్పారు. బాణసంచా విక్రయించడం, కాల్చడంతో పాటు నిల్వ ఉంచకూడదని, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ కలిగి ఉండకూడదని చెప్పారు. ఇప్పటికే బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ కొట్టకూడదని పెట్రోల్ విక్రయిదారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలతో పాటు ధర్నాలు నిర్వహించరాదని, గ్రామాల్లో ఎక్కువ మంది గుమ్మి గూడి ఉండకూడదని తెలిపారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో టపాసులను కాల్చడం, డిజెలు ఏర్పాటు చేయడం, అల్లర్లు సృష్టించడం చట్టరీత్యా నేరమన్నారు. అతిక్రమించినవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్ల అడ్డుకట్టకు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పోలీసులకు 9440796436 సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.